# 13. మనసును కరిగించే మాటలు

"నా ప్రభువు నన్ను తొమ్మిది విషయాల్ని గురించి ఆదేశించాడు. 1-రహస్యంగానైనా, బహిరంగంగానైనా ఎట్టి పరిస్థితిలోనూ దేవునికి భయపడాలి. 2-కోపంగా ఉన్నా, సంతోషంగా ఉన్నా సత్యమే మాట్లాడాలి. 3-పేదరికంలోనూ, ఐశ్వర్యంలోనూ మధ్యేమార్గం అవలంబించాలి. 4-నా పట్ల నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించినవాని పట్ల నేను దయాదాక్షిణ్యాలతో ప్రవర్తించాలి. 5-నాకివ్వకుండా అడ్డుకున్న వానికి నేనివ్వాలి. 6-నాపై దౌర్జన్యం చేసినవాడ్ని నేను క్షమించాలి. 7-నా మౌనం చింతనై, నా పలుకులు దైవధ్యానమై ఉండాలి. 8-నా దృష్టి గుణపాఠం గ్రహించేదిగా ఉండాలి. 9-నేను మంచిని గురించి ప్రజలను ఆదేశించాలి." -మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం), (ఆధారం-తిర్మిజి)

## పారలౌకిక దృష్టి

"మీకివ్వబడినదంతా ప్రాపంచిక జీవనసంపద, క్షణికమైన దాని తళుకుబెళుకులు మాత్రమే. దేవుని దగ్గరున్నది ఇంతకంటే ఎంతో శ్రేష్ఠమైనది, శాశ్వతమైనది. మీరు బుద్ధి నుపయోగించి ఆలో చించరా?" (ఖుర్ఆన్-28:60)

దైవప్రవక్త (స) హితోక్తి : "ప్రపంచాన్ని ప్రేమించేవాడు తన పరలోకాన్ని నాశనం చేసుకుంటాడు; పరలోకాన్ని ప్రేమించేవాడు తన ప్రపంచాన్ని నష్టపరచుకుంటాడు. కనుక ప్రజలారా! మీరు అంతమైపోయే (ప్రాపంచిక) జీవితం కంటే శాశ్వతంగా ఉండే (పరలోక) జీవితానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వండి." (మిష్కాత్)

దైవప్రవక్త (స) హితోక్తి: "మీరు మీకన్నా తక్కువ స్థితిలో ఉన్నవారి వైపు చూడండి. మీకన్నా ఉచ్ఛ స్థితిలో ఉన్నవారి వైపు చూడకండి. దేవుడు మీకు ప్రసాదించిన అనుగ్రహాల పట్ల మీరు కృతజ్ఞతా భావంతో ఉండటానికి ఇదెంతో మంచిపద్ధతి. (బుఖారీ, ముస్లిం)

## నిరంతర పుణ్యం

దైవప్రవక్త (స) హితోక్తి: "మనిషి చనిపోయాక మూడు విధాల కర్మలుతప్ప మిగిలిన కర్మలన్నీ అంతమైపోతాయి. ఆ మూడు కర్మలు: 1-నిరంతర దానం, 2-ఎల్లప్పుడూ ప్రయోజనంచేకూర్చే విద్య, 3-మృతునికోసం దైవాన్ని ప్రార్థించే మంచిసంతానం." (ముస్లిం)

## బాటసారి

ఒకసారి దైవప్రవక్త (స) చాపపై పడుకుంటే ఆయన ఒంటిపై చాప తాలూకు చారలు ఏర్పడ్డాయి. అది చూసి మేము "దైవప్రవక్తా! మీరు అనుమతిస్తే మేము మీకోసం ఓ పరుపు తయారుచేసిస్తాం" అన్నాం. దానికాయన "అలాంటివి ఎందుకు నాకు? నా ప్రాపంచిక జీవితం చెట్టుక్రింద కాసేపు సేదతీర్చుకొని చెట్టువదలి వెళ్ళిపోయే బాటసారి లాంటిది" అని అన్నారు. (తిర్మిజీ); దైవప్రవక్త(స) హితోక్తి: "భయపడినవాడు తెల్లవారకముందే బయలు దేరుతాడు. తెల్లవారకముందే బయలుదేరినవాడు గమ్యానికి చేరుకుంటాడు. వినండి! అల్లాహ్ బేరం ఎంతో విలువైనది. జాగ్రత్తగా వినండి! అల్లాహ్ బేరమంటే స్వర్గమే!" (తిర్మిజీ)



## ఆత్మ-పరమాత్మ

దైవప్రవక్త (స) దేవుని మాటలు ఇలా వ్యక్తపరిచారు: "నేను నా దాసుడిపై విధిగాచేసిన విషయాలు ఆచరించి అతను నాకు దగ్గర యితే అంతకన్నా నాకు ప్రీతికరమైన విషయం మరేదీలేదు. నా దాసుడు ఐచ్ఛికసత్కార్యాల ద్వారా కూడా నాకు దగ్గరవుతాడు. అప్పుడు నేనతణ్ణి ప్రేమిస్తాను. నేనతణ్ణి ప్రేమించడం మొదలెడితే, (క్రమేణా) నేనతను వినే చెవినై పోతాను, అతను చూసే కంటినై పోతాను, అతను పట్టుకునే చేయినై పోతాను, అతను నడిచే కాలునై పోతాను, అతను నన్నేదైనా అడిగితే నేనతనికి తప్పకుండా ఇస్తాను. దేని బారి నుండైనా శరణువేడితే నేనతనికి తప్పక శరణు ఇస్తాను. (బుఖారీ)

దైవప్రవక్త (స) దేవుని మాటలు ఇలా తెలిపారు: "దాసుడు నాకు జానెడు దూరం దగ్గరయితే నేనతనికి మూరెడు దగ్గరవుతాను. అతను మూరెడు దగ్గరైతే నేను బారెడు దగ్గర వుతాను. అతను నావైపు నడచివస్తే నేనతని వైపుకు పరుగెత్తుకువస్తాను." (బుఖారీ)

## ప్రజాసేవ

ఓసారి కొందరు అనుచరులు దైవప్రవక్త (స) ముందు తమ మిత్రుడొకడ్ని పొగుడుతూ "మాయీ మిత్రుడు లాంటి మంచివాడ్ని మేమింత వరకూ ఎక్కడా చూడలేదు. ప్రయాణంలో కూడా అతను ఖుర్ఆన్ పఠిస్తుంటాడు. మేము ఎక్కడైనా బస చేసినప్పుడు అతను నమాజ్ చేయడంలో లీనమైపోతాడు" అని అన్నారు. దైవప్రవక్త (స) వారి మాటలు విని "సరే, అతని సామగ్రికి ఎవరు కాపలా ఉంటారు?" అంటూ అనేక విషయాలు అడిగారు. చివరికి "అతని ఒంటెకు ఎవరు మేత పెడతారు?" అని కూడా అడిగారు. వాటికి మేము "మేమే అతని సామగ్రికి కాపలా ఉంటాము. మేమే అతని ఒంటెకు నీరు, మేత పెడుతుంటాము" అని చెప్పాం. అప్పుడు దైవప్రవక్త (స) "అయితే ఖుర్ఆన్ పారాయణం చేసే, ఆరాధనలో లీనమై పోయే ఆ మనిషి కంటే (ప్రజాసేవ చేసే) మీరే శ్రేష్ఠులు" అని అన్నారు. (అబూదావూద్)

## అపకారికి నుపకారం

దైవప్రవక్త(స) హితోక్తి: "మీరు మీప్రవర్తనావైఖరిని లోకుల ప్రవర్తనావైఖరికి అనుగుణంగా మార్చుకోకండి. ఇతరులు మంచి చేస్తే తామూ మంచి చేస్తామని, ఇతరులు దౌర్జన్యం చేస్తే తామూ దౌర్జన్యం చేస్తామని చెప్పడం సరికాదు. మిమ్మల్ని మీరు ఒక నియమావళికి కట్టుబడి ఉండేలా రూపొందించుకోండి. ఇతరులు మేలుచేస్తే మీరూ మేలు చేయండి. కాని ఇతరులు మీకు అపకారం తలపెడ్తే మీరు మాత్రం వారికి అపకారం తలపెట్టకండి." (మిష్కాత్)

## మానవ సమానత్వం

దైవప్రవక్త (స) హితోక్తి: 'దేవుడు తన గ్రంథంలో 'మానవులారా! మేము మిమ్మల్ని ఒకే స్త్రీపురుషజంట నుండి పుట్టించాం. తర్వాత మీ పరస్పర పరిచయం కోసం మిమ్మల్ని విభిన్న జాతులుగా, తెగలుగా చేశాం. అయితే మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే దేవునిదృష్టిలో ఎక్కువ గౌరవనీయుడు.' అన్నాడు. కనుక అరబ్బీయుడిపై అరబ్బేతరునికి, అరబ్బేతరునిపై అరబ్బీయుడికి; తెల్లవాడిపై నల్లవాడికి, నల్లవాడిపై తెల్లవాడికి ఎలాంటి ఆధిక్యత లేదు. ఆధిక్యతకు గీటురాయి దేవునిపట్ల భయభక్తులు కలిగివుండటమే." (బుఖారి)

## నిజమైన విశ్వాసి

దైవప్రవక్త (స) హితోక్తులు: "నాప్రాణం ఎవరి అధీనంలో ఉందో ఆ శక్తిస్వరూపుడి సాక్షి! తనకోసం ఇష్టపడినదాన్నే తన సోదరుని కోసం కూడా ఇష్టపడనంత వరకు ఏవ్యక్తీ నిజమైన విశ్వాసి కాలేడు." (బుఖారి); "ఏ యువకుడైనా ఒక వృద్ధుడ్ని అతని వృద్ధాప్యం చూసి గౌరవిస్తే దేవుడు అతని వృద్ధాప్యంలో అతడ్ని గౌరవించేవారిని పుట్టిస్తాడు." (తిర్మిజీ); "ప్రజలపై దయజూపని మనిషిపై దేవుడు కూడా దయజూపడు." (బుఖారీ)

## నిష్ఠ దరిద్రుడు

దైవప్రవక్త (స) హితోక్తి: "నా అనుచర సముదాయంలో ప్రళయదినాన ఒకడు నమాజ్, జకాత్, రోజా వగైరా సత్కార్యాలు తీసుకొని వస్తాడు. కాని అతను ఎవరినైనా దూషించి ఉంటాడు. ఎవరి పైనయినా అపవాదు లేపిఉంటాడు. ఎవరి ధనాన్నయినా అన్యాయంగా కాజేసి ఉంటాడు. ఎవర్నినైనా హత్య చేసిఉంటాడు. ఎవర్నినైనా అన్యాయంగా కొట్టిఉంటాడు. అంచేత అతను ఎవరెవరిని వేధించాడో, ఎవరెవరి హక్కులు కొల్లగొట్టాడో వారందరికీ అతని పుణ్యకర్మలు పంచిస్తారు. అప్పటికీ వారి హక్కులు పూర్తిగా నెరవేరకముందే అతని పుణ్య కర్మలు అయిపోతే, ఆ హక్కుదారులు చేసిన పాపాలు అతని ఖాతాలో వేసి అతడ్ని నరకంలో పడవేయడం జరుగుతుంది." (ముస్లిం)

## జాతుల ఉత్థానపతనాలు

మహాప్రవక్త (స) మహితోక్తి : "మీ నాయకులు చెడ్డవాళ్ళయి, మీ ధనికులు పిసినారులయి, మీ వ్యవహారాలు స్త్రీల చేతుల్లోకి పోయినప్పుడు మీకు భూమి వీపు (జీవితం) కంటే భూమి కడుపు (మరణం) మంచిది." (తిర్మిజి)

దైవప్రవక్త (స) హితోక్తి: "నమ్మకద్రోహం సర్వసామాన్యమైన జాతిలో దేవుడు శత్రుభయం, బీభత్సాలను వ్యాపింపజేస్తాడు. వ్యభిచారం అంటువ్యాధిలా ప్రబలిన సమాజం నాశనం కాకతప్పదు. తూనికలు–కొలతల మోసం సర్వవ్యాప్తమైపోయిన సమాజం ఆహార శుభం కోల్పోతుంది. అన్యాయమైన తీర్పులు,నిర్ణయాలు జరిగేచోట రక్తపాతం జరుగు తుంది. ఒప్పందం ఉల్లంఘించిన జాతిని శత్రువు తప్పక జయిస్తాడు." (మిష్కాత్)

"మీలో ఒక వర్గం మంచివైపుకు పిలిచేవారు, సత్కార్యాలు చేయమని ఆజ్ఞాపించేవారు, చెడులనుండి వారించేవారు తప్పకఉండాలి. అలాంటివారే సాఫల్యంచెందేవారు."(ఖు–3:104)

## దురవస్థలు దాపురించకముందే మేల్కోండి

దైవప్రవక్త (స) హితోక్తి: "ఏడు రకాల అవస్థలు దాపురించక ముందే సత్కార్యాలు చేయడానికి త్వరపడండి. మీరు (ధర్మాన్ని) మరచిపోయేలాచేసే పేదరికం కోసం ఎదురు చూస్తున్నారా? హద్దుమీరి ప్రవర్తించేలాచేసే కలిమి కోరుకుంటున్నారా? ఆరోగ్యం పాడుచేసే రోగం కోసం ఎదురుచూస్తున్నారా? లేక బుద్ధి, వివేకాల్ని పోగొట్టే వృద్ధాప్యం కోసం ఎదురు చూస్తున్నారా? లేక తృటిలో ప్రాణంతీసే చావుకోసం ఎదురుచూస్తున్నారా? లేక కన్పించని కీడుల్లో అతి హానికరమైన దజ్జాల్ రాకకోసం ఎదురుచూస్తున్నారా? లేక ప్రళయం కోసం ఎదురుచూస్తున్నారా? ప్రళయమైతే ఎంతో భయంకరమైనది, చేదైనది." (తిర్మిజీ)



దైవప్రవక్త(స) హితోక్తి: "రెండు వరాలున్నాయి. వాటి దుర్విని యోగంవల్ల అనేకమంది నష్టపోతున్నారు. అవి–ఆరోగ్యం, తీరిక." (మిష్కాత్)

## మార్గదర్శి

దైవప్రవక్త (స) హితోక్తి: "జాగ్రత్త! సమీపకాలంలో ఒక పెద్ద కల్లోలం తలెత్తుంది.. ఖుర్ఆన్ ద్వారా మాత్రమే మీరు దీని బారి నుండి బయటపడగల్గుతారు. ఈగ్రంథంలో మీకు పూర్వం గతించిన జాతులు చవిచూసిన పర్యవసానాలు కూడా ఉన్నాయి; మీతర్వాత రాబోయేవారికి ఎదురయ్యే పరిణామాలు కూడా ఉన్నాయి: ఇందులో మీ దైనందిన వ్యవహా రాలకు సరైన పరిష్కారాలు కూడా ఉన్నాయి... ఈ గ్రంథం ఆషామాషీ వాక్కు కాదు. ఇది గంభీరమైన, నిర్ణయాత్మకమైన వాణి. దుర్మార్గుడై ఈ గ్రంథాన్ని విడనాడిన క్రూరుడ్ని దేవుడు అణగద్రొక్కుతాడు. దీన్ని వదిలి వేరేచోటు నుండి మార్గదర్శకత్వం పొందడానికి ప్రయత్నించే వాడ్ని దేవుడు మార్గభ్రష్టుడిగా చేస్తాడు. ఈగ్రంథం దేవుడు పంపిన పటిష్ఠమైన త్రాడు. ఇది వివేకంతమైన హితవాణి. ఇదే సరైన (మార్గం." (తిర్మిజి, దార్మి)

"(జీవిత)మార్గం నిర్దేశించవలసిన బాధ్యత మాపైనే ఉంది. ఇహలోకం మాదే; పర లోకమూ మాదే. కనుక నేను మిమ్మల్ని ప్రజ్వరిల్లే అగ్ని గురించి హెచ్చరిస్తున్నాను. సత్యాన్ని నిరాకరించి ముఖం తిప్పుకునే దౌర్భాగ్యుడుతప్ప మరెవరూ అందులో పడరు." (ఖు–92:12–17)

## మృత్యువు తరుముకొస్తోంది

దైవప్రవక్త (స) హితోక్తి: "ప్రళయదినాన 5 విషయాల్ని గురించి అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వనంతవరకు మానవుడు నిల్చున్న చోటునుంచి ఒక్కఅంగుళం కూడా కదలలేడు. ఆ అయిదు విషయా లివి: ① నీ వయస్సును ఏ కార్యకాలాపాల్లో అంతమొందించావు? ② నీ యౌవనాన్ని ఎక్కడ వ్యర్థపరిచావు? ③ ధనాన్ని ఎలా సంపాదించావు? ④ దాన్ని ఏవిధంగా ఖర్చుపెట్టావు? ⑤ నీకు ప్రసా దించిన (ధర్మ)జ్ఞానాన్ని ఏమేరకు ఆచరించావు?" (తిర్మిజి)

ఈజీవితం క్షణభంగురం. కలలా కరిగిపోయే మంచుగడ్డ లాంటిది. సంవత్సరాలు నెలలవుతూ, నెలలు దినాలవుతూ కాలం అతివేగంగా వెనక్కి పరుగెడుతోంది. మనిషికి మృత్యువు ఎప్పుడు కాటువేస్తుందో తెలియదు. కోరలు చాచి బుసలుకొడ్తూ వెంటపడే కొండచిలువలా, రక్తదాహం తీరని పెద్దపులిలా మృత్యువు మనిషిని తరుముకొస్తోంది.

మరి జనం ప్రాపంచికమైకం వదలి స్వార్థానికి సమాధికట్టే సమయం రాలేదా? అడవిలోని ఓ నూతిలో పడిపోయి చెట్టుకొమ్మ పట్టుకొని వ్రేలాడుతూ, పైన పెద్దపులి గాండ్రిస్తున్నా, క్రింద మొసలి నోరుతెరచి వగరుస్తున్నా గమనించక చెట్టుకొమ్మ నుండి పడుతున్న తేనెబిందువుల్ని నాకేవాడిలా ఏమరుపాటులోనే పడివుంటారా? లేక వాస్తవం అర్థంచేసుకొని ఆచరణ వైపుకు మరలుతారా?